



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్ లో 500 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము. ఈ టాక్ షోలను విని, వీటిని అక్షరీకరించిన వారు శ్రీ బొడ్డు సత్యనారాయణ(హైదరాబాదు). వారికి కృతజ్ఞతలు తెలియచేస్తూ, ఈ ప్రయోగం కౌముది పాఠకులకు నచ్చుతుందని ఆశిస్తున్నాము.

# దుర్గాబాయ్ దేశ్ ముఖ్

## రెండవ భాగం



ప్రముఖ సంఘసేవకురాలు, నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం లక్షలాదిమంది మహిళల జీవితాల్లో వెలుగు నింపే అనేక పథకాలకు , ప్రణాళికలకు శాశ్వత రూపం కల్పించిన తెలుగు మహిళా తేజం దుర్గాబాయి దేశముఖ్ గా అందరికి తెలిసిన దుర్గాబాయమ్మ గారి జీవిత విశేషాలు రెండవ భాగం.

దుర్గాబాయి దేశముఖ్ అనగానే గుర్తొచ్చేది ఆంధ్రమహిళా సభ, నిజానికి ఈ ఆంధ్రమహిళా సభ అనేది ఒక సంస్థ కాదు.అది ఒక వ్యవస్థ. ఆంధ్రమహిళా సభ అనే గొడుగు కింద అనేక సంస్థలు గత 60 ,70 సంవత్సరాలుగా విశిష్టమైన సేవలు అందిస్తున్నాయి.ఈ సేవల గురించి కిందటి భాగంలో తెలుసుకున్నాం కానీ, సంపూర్ణత కోసమని ఒక్కసారి క్లుప్తంగా గుర్తుచేసుకుందాం. ఈ ఆంధ్రమహిళాసభ అనే గొడుగు కింద 1950 ప్రాంతాలనుంచే దుర్గాబాయమ్మ గారు స్థాపించిన శిశువిహార్ లు, హై స్కూల్ లు, కాలేజీలు బి.ఈ.డి.ట్రైనింగ్ కాలేజీలు కండెన్సడ్ కోర్సు లు, నర్సింగ్ శిక్షణాలయము , చేతిపని శిక్షణాలయము , వర్క్ షాప్స్ ఇలాంటివన్నీ గత 60 ,70 సంవత్సరాలుగా ఎంత సేవలు చేస్తున్నాయో, మహిళాభ్యుదయానికి

ఎంత కృషి చేస్తున్నాయో వేరే చెప్పాల్సినవసరంలేదు. ప్రత్యక్షంగా చూడొచ్చు మనం. 1978 ప్రాంతంలోనే మినీ హాస్పిటల్స్ ఆన్ వీల్స్ అనే దాన్ని కూడా స్థాపించిన ఘనత దుర్గాబాయి దేశముఖ్ గారు స్థాపించినటువంటి సంస్థకి చెందుతుంది. కేవలం సామాజిక సేవ,సంస్థలు స్థాపించడమే కాకుండా దుర్గాబాయి దేశముఖ్ గారు అలనాటి కేంద్ర ప్రభుత్వంలో చాలా ప్రత్యేకమైనటువంటి పాత్ర పోషించారు. ఆవిడ ఎక్కడున్నా , ఏ పని చేస్తున్నా – స్త్రీలకు ఎలా సహాయపడాలి, ముఖ్యంగా నిస్సహాయులైనటువంటి స్త్రీలని వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడేలాగా ఎలా చేయాలి అనేది ఒకటే ఆలోచన ఆవిడకు! అలాంటి ఆలోచనతోనే ఆవిడ కేంద్రప్రభుత్వంలో కీలక మైన పదవుల్లో వున్నప్పుడు, అప్పటివరకూ క కొంచెం అటూఇటూగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ సోషల్ వెల్ఫేర్ వింగ్ ని (సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు) స్థాపించి, దానికావిడ మొట్టమొదటి చైర్మన్ కూడా అయ్యారు. ఆ సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు కింద భారతదేశం అంతా వాలంటరీ ఆర్గనైజేషన్స్ కి సహాయం చేసి, స్త్రీలకి సహాయం చేసే సంస్థల్ని, కోర్సుల్ని అలాంటి శిక్షణాలయాల్ని స్థాపించడానికి కూడా దుర్గాబాయమ్మ గారు ఆ రోజుల్లోనే ఎంతో కృషి చేశారు. ఢిల్లీ లో ఆంధ్ర ఎడ్యుకేషన్ బోర్డు స్థాపించి, దాని కింద స్కూళ్ళు, కాలేజీలు స్థాపించడానికి దుర్గాబాయమ్మ గారే పునాది వేశారు. ఇంకా చెప్పాలంటే,హైదరాబాద్ చుట్టుపక్కల సంగారెడ్డి, మహబూబ్ నగర్, షాద్ నగర్ లాంటి చోట్ల కూడా ఈ ఆంధ్రమహిళాసభ ఆధ్వర్యంలో హైస్కూళ్ళు, నర్సింగ్ కాలేజీలు ఇలాంటివి మొదలుపెట్టారు. బహుశా ఇప్పుడు కూడా కొనసాగుతున్నాయి అనుకుంటాను. ఇంకా చెప్పాలంటే, దుర్గాబాయమ్మ గారు భారతదేశ రాజ్యాంగాన్ని నిర్మాణానికి అవసరమైన సూచనలు చేసే కమిటీలో ప్రముఖమైన పాత్ర వహించి సభ్యురాలిగా కొనసాగారు.

దుర్గాబాయమ్మ గారు స్థాపించిన సంస్థలన్నిటి గురించి ఏం చెప్తారంటే– దుర్గాబాయమ్మగారు స్థాపించిన హాస్పిటల్ లో ఎవరైనా ఒక పాప జన్మిస్తే, ఆమె జీవితం స్థిరపడేంతవరకుకూడా అవసరమైనటువంటి కోర్స్ లన్నీ ఈ దుర్గాబాయమ్మగారి సంస్థల్లోనే ఉన్నాయి. ఎలాగంటే– ఆంధ్రమహిళా సభ నర్సింగ్ హోమ్ లో పాప పుట్టిందనుకుందాం...ఆమె అక్కడే శిశువిహార్ లో చదువొచ్చు. ఆ తర్వాత హై స్కూల్ లో చదువొచ్చు. అక్కడే కాలేజీలో చదువొచ్చు. అక్కడే బి.ఈ.డి.చదివి టీచర్ కావచ్చు. లేదంటే నర్స్ గానో లేకపోతే అక్కడ ప్రెస్ లోనో ఒకేషనల్ కోర్సు చదివి అలా కూడా జీవనోపాధి సంపాదించుకోవచ్చు. అంటే – ఒక మహిళ జీవితం పుట్టుక దగ్గరినుంచి స్థిరపడడం వరకు కావలసినవన్నీ దుర్గాబాయమ్మ గారు సమకూర్చారు. ఈ పనులన్నీ ఆమె సాధించింది 60 ,70 సంవత్సరాల కిందట. ఇంత ముందు చూపుతో ఈ సంస్థలన్నిటికి బకమైన పునాదుల మీద నిర్మించింది ఒక్క మహిళ. ఒకే ఒక్క మహిళ. ఆవిడకి సహాయం చేసింది వాళ్ళ అమ్మగారు కృష్ణవేణమ్మ గారు. నిస్వార్థమైన సంఘసేవ ఆవిడ వేసిన బలమైన పునాది. మహిళా లోకాన్ని స్వావలంబన దిశగా నడిపించాలని దృఢ సంకల్పం వీటన్నిటికీ తోడయ్యింది. పట్టుదల, తెగువ, చొరవ. ఇవన్నీ కూడా దుర్గాబాయమ్మ గారి జీవితం నుంచి అన్ని తరాలవారు నేర్చుకోదగిన వ్యక్తిత్వ లక్షణాలు. సంకల్పమే ఆయుధంగా , పట్టుదలే పెట్టుబడిగా దుర్గాబాయమ్మ గారు సాధించిన విజయాలు అద్భుతం, అమోఘం, అనన్యసామాన్యం అని చెప్పుకోవచ్చు.

క్రిందటిభాగంలో ప్రారంభించిన దుర్గాబాయి దేశ్ ముఖ్ గారి జీవితవిశేషాలు అతిక్లుప్తంగా గుర్తు తెచ్చుకుని తర్వాత రెండో భాగంలోకి వెళదాం. దుర్గాబాయమ్మ గారు కాకినాడలో అతి సాధారణమై మధ్యతరగతి కుటుంబంలో జన్మించి 24 సంవత్సరాల వరకు కూడా ఫార్మల్ ఎడ్యుకేషన్ అంటే స్కూలుకి వెళ్లకుండా ఆవిడ పెరిగారు. 1909 లో ఆవిడ జన్మించారు. ఐదో తరగతి తోటే చదువు మానేసి అప్పట్లో ఉన్న పరిస్థితుల ననుసరించి హిందీ నేర్చుకోవడం ప్రారంభించి, నేర్చుకునే రోజుల్లోనే పిల్లలకి నేర్పుతూ ఒక పాఠశాల కూడా స్థాపించారు. బాలికా హిందీ పాఠశాల అనే స్కూలుని 12 సంవత్సరాల వయసులో స్థాపించారు, అంటే 14 సంవత్సరాలకల్లా ఆవిడ ఆ స్కూలుకి ప్రిన్సిపాల్ అయ్యారు. అలా ఆవిడ 12 , 13 సంవత్సరాల వయసు నుంచే స్వంతంగా ఇలా ఏదైనా సరే స్త్రీలకి సహాయం చేయడం వాళ్లకు నేర్పడం లాంటివి ప్రారంభించి, కాకినాడలో నేషనల్ కాంగ్రెస్ సభలు లాంటివి జరిగేటటువంటి సందర్భాల్లో 13 ,14 సంవత్సరాల వయసుకే మహాత్మా గాంధీ గారి తోటి, జవహర్ లాల్ నెహ్రూ గారి తో కూడా పరిచయం ఏర్పడింది. అంత చిన్న వయసులో జరిగిన పరిచయమే భవిష్యత్తులో దుర్గాబాయమ్మ గారి రాజకీయ జీవితంలో అత్యంత విలువైన ప్రముఖ పాత్ర పోషిస్తాయి అని ఆ చిన్నతనంలో ఆవిడకీ తెలియదు. ఆవిడ వివాహమయ్యి కూడా అవివాహితగా ఉన్నారు. ఇది కూడా ఆవిడ ఆత్మకథలో రాసుకున్నారు. 8 సంవత్సరాల వయసులో జరిగిన బాల్యవివాహాన్ని 15 సంవత్సరాల వయసులో వాళ్ళ నాన్నగారి దగ్గరికెళ్లి "నేను ఈ వివాహ బంధం కొనసాగించలేను" అని చెప్పి తర్వాత భర్తకు కూడా చెప్పి ఆవిడ అవివాహితగానే చాలా రోజులు కొనసాగారు. ఇలా ఆవిడ 1922 ,23 ప్రాంతాల్లో, అంటే ఆవిడకీ 13 ,14 సంవత్సరాల వయసు సమయంలో, బాలికా హిందీ పాఠశాలను కొనసాగిస్తూ, రాజకీయ కార్యకలాపాల్లో ఉంటూ ఉండగా– 1929 లో అంటే దుర్గాబాయమ్మగారికి

20 సంవత్సరాల వయసులో వాళ్ళ నాన్నగారు మరణించారు. ఆయన అప్పటికి కేవలం 36 సంవత్సరాలు. మరణించేటప్పుడు భార్యకు చెప్పారట "నేను అన్నీ మంచిపనులే చేశాను కానీ అమ్మాయి విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోలేకపోయాను. తనకి ఎప్పుడైనా సరే వివాహం చేసుకుంటానంటే నచ్చినవాడితో వివాహం చెయ్యి" అని. ఆయన మరణించినప్పుడు ఒక్క సంఘటన జరిగింది. ఆ రోజుల్లో భర్త మరణిస్తే భార్యకి జుట్టు తీసేసి బోడిగుండు చేసి ఆవిడని కూడా తెల్ల బట్టలు కట్టి ఇంట్లో నుంచి బయటకు రాకూడదని ఇలాంటి ఆంక్షలన్నీ కూడా కొనసాగుతున్న రోజులలో దానికి వ్యతిరేకంగా సాంఘిక విప్లవాలు కూడా కొనసాగుతూ ఉన్నాయి. ఆ రోజుల్లో దుర్గాబాయమ్మ గారు వాళ్ళ నాన్న గారు మరణించాక వచ్చిన బంధువులందరూ కూడా వాళ్ళ అమ్మగారికి "ఇలాగా చేయాలి, జుట్టు తీసేసి తెల్ల బట్టలు కట్టుకోవాలి" అంటుంటే, ఆవిడ ధైర్యంగా ఎదురు నిలిచారు. "ఇలాంటివన్నీ చేయడానికి వీలు లేదు. మా అమ్మ మామూలుగానే ఉంటుంది" అన్నప్పుడు ఆ వచ్చిన బంధువులు అందరూ "ఇలాగా అయితే కనక మిమ్మల్ని మేము బహిష్కరిస్తాము ఈ సెర్మనీస్ వీటికి కూడా మేము ఉండము, వెళ్ళిపోతాము" అంటే "మీరు వెళ్లిపోండి వెళ్ళిపోయినాసరే మాకేమి అభ్యంతరం లేదు. మా అమ్మ మాత్రం అలాంటి పనులు చెయ్యదు" అని ఎదురొడ్డి నిలిచింది ఆ వయసులో ఆ రోజుల్లోనే దుర్గాబాయమ్మ గారు. చిన్నపట్నుంచి కూడా ఆవిడ కుnna బలమైన ఆయుధం ఆవిడ ధైర్యం, పట్టుదల.

1929,30 ప్రాంతాలు వచ్చేసరికి వాళ్ళమ్మగారికి కాస్త అనారోగ్యం చేసింది. ఆ రోజుల్లో మరి పెద్ద ఆసుపత్రి అంటే మద్రాసు వెళ్ళాలి. మరి మద్రాస్ లో ఎక్కడుండాలి?ఎలా చెయ్యాలి? మద్రాస్ లో దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు ఉండేవాళ్ళు. ఆంధ్ర పత్రిక , భారతి అలాగే అమృతాంజనం ఇలాంటివన్నీ కూడా కొనసాగించింది నాగేశ్వరరావు పంతులు గారు. ఆయన సంఘసేవలో ఉండేవాళ్ళు అలాగే హరిజనులకు సేవ చేసేవాళ్ళు అవసరమైన వాళ్లందరికీ కూడా ఆయన అడగకుండానే సహాయం చేసే వ్యక్తిత్వం. అందుకే ఆయన్ని దేశోద్ధారక అనేవాళ్ళు. ఆ నాగేశ్వరరావు పంతులు గారికి దుర్గాబాయమ్మ గారు ఒక ఉత్తరం రాశారు. "మా అమ్మ గారికి బాగాలేదు. నాపేరు ఇది. నేను మద్రాసు వస్తాను. నాకు ఏమైనా వసతి చూపిస్తారా అమ్మగారిని హాస్పిటల్ లో చూపించుకోడానికి?" అని. ఆయన వెంటనే ప్రత్యుత్తరమిచ్చారు. అప్పటికే దుర్గాబాయమ్మ గారి పేరు అందరికి తెలుసు. ఎందుకంటే మహాత్మా గాంధీ దక్షిణ భారత దేశం ఎప్పుడొచ్చినా ఆయన హిందీ ప్రసంగాన్నితెలుగు లో అనువాదం చేసేది , అప్పుడప్పుడు తమిళంలో కూడా అనువాదం చేసేది దుర్గాబాయమ్మగారే. అందుకని నాగేశ్వరరావు పంతులు గారు కూడా "సరే అమ్మా రా. మా ఇంటి వెనకాల ఒక అవుట్ హౌస్ వుంది. ఆ అవుట్ హౌస్ లో ఉండినువ్వు మీ అమ్మ గార్ని హాస్పిటల్ లో చూపించొచ్చు" అని వెంటనే సమాధానమిచ్చారు. ఆ విధంగా 1929 ,30 ప్రాంతాల్లో దుర్గాబాయమ్మగారు వాళ్ళమ్మ కృష్ణవేణమ్మ గారిని అనారోగ్యం నిమిత్తం మద్రాసు తీసికెళ్ళి,నాగేశ్వరరావు పంతులు గారి ఇంట్లో ఉండి వాళ్ళమ్మ గారిని ఆసుపత్రి లో చూపించారు.

ఆవిడ కొంచెం ఆరోగ్యం స్వస్థత చేకూరింది. ఇంకా కాకినాడ వెళ్ళిపోదాం అని వాళ్ళమ్మ గారు అనుకుంటూ ఉండగా – ఇంకొక పరిణామం సంభవించింది రాజకీయాల్లో. అదేమిటంటే, 1930 ఏప్రిల్ లో మహాత్మా గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారు. అంటే ఆ సముద్రం దగ్గరున్న వాళ్ళందరూ కూడా అక్కడికెళ్లి ఉప్పు తయారు చేయాలి, బ్రిటిష్ వాళ్ళు ఉప్పు మీద పన్ను వేస్తున్నారు, దానికి నిరసనగా సత్యాగ్రహానికి పిలుపునిచ్చారు. అయితే ఆయన ఒక మాట ఏంచెప్పారంటే, "ఇందులో ఆడవాళ్లు పాల్గొనవద్దు ఎందుకంటే, ఆడవాళ్ళకి అంత బలం ఉండదు, అంత శక్తి ఉండదు" అని. అప్పుడు దుర్గాబాయమ్మ గారు వాళ్ళమ్మగారితో "సరే అమ్మా.. నీవు కాకినాడ వెళ్ళు. నేను ఇక్కడ రాజకీయాల్లో కొంత చురుకుగా పాల్గొనాలి" అని చెప్పి వాళ్ళమ్మగారిని కాకినాడ పంపించేసి, ఆవిడ మాత్రం మద్రాసు లోనే ఉండి నాగేశ్వరరావు పంతులు గారి ద్వారా మహాత్మా గాంధీ గారికి ఒక ఉత్తరం వ్రాసి "మీరు ఆడవాళ్లు పాల్గొనవద్దని ఎందుకంటున్నారు? ఆడవాళ్లు పాల్గొనగలము, పాల్గొని చూపిస్తాము. మాక్కూడా ఈ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనే అవకాశం ఇవ్వండి" అని, ఆయన దగ్గర్నుంచి అనుమతి తెచ్చుకొని, అప్పుడు మద్రాసులో ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమాన్ని ముందుకు తీసికెల్దామనుకుంటున్నటువంటి రాజకీయ నాయకుల సంప్రదించారు. టంగుటూరి ప్రకాశం పంతులుగారు, సి.రాజగోపాలాచారిగారు లాంటి రాజకీయ నాయకుల ప్రణాళిక ఏమిటంటే, – నెల్లూరు లాంటి మిగతా చోట్లకు వెళ్లి, అక్కడ సముద్రం దగ్గర ఉప్పు సత్యాగ్రహం చెయ్యాలని. దుర్గాబాయమ్మ గారు అడిగారు "ఇదేమిటండి? మద్రాసులో ఉన్నటువంటి సముద్ర తీరాన్ని వదిలేసి మీరు అందరూ అక్కడికెళ్తున్నారు. మరి మద్రాసులో మనం ఉప్పు సత్యాగ్రహం చేయకపోతే ఎలా? ఇది ప్రధానమైన ప్రదేశం కదా! ఇక్కడ కూడా చెయ్యాలి" అని. టంగుటూరి ప్రకాశం పంతులు గారికి ఈవిడ చెప్పిన ఆ విషయం కూడా మంచిదే అనిపించింది. ఆయనకు ఎలాగూ తెలుసు ఈ ఉద్యమం మొదలు కాగానే-తననీ, ,మిగతావాళ్ళని బ్రిటిష్ వాళ్ళు అరెస్ట్ చేస్తారు

అని. అప్పుడే అక్కడున్నటువంటి స్థానిక నాయకులందరికీ కూడా "నేను ఒకవేళ జైలు కి వెళితే , నా స్థానంలో ఈ దుర్గాబాయమ్మ గారు ముందుండి నడిపిస్తారు ఉప్పు సత్యాగ్రహాన్ని" అని. ఆ విధంగా దుర్గాబాయమ్మ గారు ముందు వుండి మద్రాసులో ఉప్పు సత్యాగ్రహం కార్యక్రమాన్ని నడిపించారు. అందులో భాగంగానే, సత్యాగ్రహ శిబిరాలు ఏర్పరచడం, బ్రిటిష్ వాళ్లకు దొరక్కుండా సముద్రం దగ్గరికెళ్లి ఆ ఉప్పుని తయారుచేయడం, మళ్ళా వాళ్ళ కంటపడకుండా వెనక్కి రావడం.. ఇలా ఒక ఐదారు వారాలు ఆవిడ చాలా మందిని సమీకరించి, ఉప్పు సత్యాగ్రహాన్ని చాలా తీవ్రమైన దశకి తీసికెళ్ళారు. బ్రిటిష్ వాళ్ళు ఎప్పుడు కనిపిస్తుందా ఈవిడని అరెస్ట్ చేద్దామని ఎక్కడ అవకాశం దొరుకుతుందా అని వాళ్ళు వేచి చూస్తున్నారు.. కేవలం మద్రాసులోనే కాకుండా చుట్టుపక్కలున్న ప్రదేశాలకు కూడా వెళ్లి అక్కడున్నటువంటి మహిళల్ని కూడా చైతన్యవంతం చేసి దుర్గాబాయమ్మ గారు ఈ ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసికెళ్ళారు. 21 సంవత్సరాల వయసులోనే ఆవిడ అంత ధైర్యంగా అంతమందిని సమీకరించి ఈ ఉప్పు సత్యాగ్రహం మొదలు పెట్టి ఒక ఆరేడు వారాలయ్యాక బ్రిటీష్ వాళ్లకి ఈవిడ్ని అరెస్ట్ చేసే అవకాశం దొరికింది.

అరెస్ట్ చేసి ఆవిణ్ణి రాయవెల్లూరు జైలు లో పెట్టారు. ఆవిడకున్న రాజకీయ చైతన్యం తోటి మామూలుగా ఉండలేరు కదా! ఆ జైలు లో ఉన్న మహిళా రాజకీయ ఖైదీల పరిస్థితులన్నిటిని పరిశీలించారు. అప్పుడు ఆవిడకి తెలిసింది – మహిళా ఖైదీలు చాలామంది నిజంగా నేరం చేయకపోయినా వాళ్లకు కోర్ట్ లో వాదించేటటువంటి శక్తి లేదు, లాయర్లు కూడా మగవాళ్లవడంతోటి అన్ని విషయాలు ధైర్యంగా చెప్పుకోలేరు . ఇలాంటి వాటి వల్ల వాళ్ళు తక్కువ తప్పు చేసినా కానీ ఎక్కువ శిక్ష పడింది. ఇలాంటివన్నీ కూడా ఆవిడ గమనించి " నేను క్రిమినల్ లాయర్ను అవుతే గనక ఆడవాళ్లు నా దగ్గరికి ఫ్రీ గా వచ్చి నా దగ్గర వాళ్ళ సమస్యలు చెప్పుకోగలరు. నేను వాళ్ళకెక్కువ న్యాయం చేయగలను" అనుకున్నారు.

అప్పటి ఆవిడ అర్హతలేమిటీ? వయసు 21 సంవత్సరాలు, హైస్కూల్ చదువు కూడా లేదు. కానీ క్రిమినల్ లాయర్ నవుదామనుకున్నారు. ఆవిడ సంకల్పం చూస్తుంటే నాకు మరొక ఇద్దరు గుర్తొస్తున్నారు. ఎవరంటే,1860 ప్రాంతాల్లోనే ఆడవాళ్ళకు ప్రత్యేకమైనటువంటి స్త్రీ వైద్యులు లేకపోవడం వల్ల ఇన్ని సమస్యలనెదుర్కొంటున్నారని గమనించి తాను కూడా ఒక లేడీ డాక్టర్ కావాలనుకొని పద్దెనిమిదేళ్ల అమ్మాయి ఆ రోజుల్లోనే మొట్టమొదటి సారిగా సముద్రాలు దాటి అమెరికాకువచ్చి అమెరికాలో ఆవిడ వైద్యురాలిగా శిక్షణ పొంది భారతదేశం వెళ్లి ప్రాక్టీసు ప్రారంభిద్దామని అనుకుంటున్నసమయంలో కేవలం 21 సంవత్సరాల వయసు కూడా నిండకుండా మరణించారు ఆవిడ పేరే ఆనందీబాయి జోషి. అలాగే ఇంకొక వ్యక్తి అంటే సంకల్పం ఎలా ఉంటుంది అని చెప్పడానికి ఉదాహరణ ఇంకొక వ్యక్తి 20 ఏళ్ళ వయసులో వాళ్ళ అన్నయ్యలిద్దరూ కూడా స్ప్రూ వ్యాధితో మరణిస్తే, ఆ వ్యాధికి ఔషధం కనిపెట్టాలి అనుకోని ఆయన ఎన్నో కష్టాలు పడి అమెరికా వచ్చి దాదాపు పాతిక సంవత్సరాలు అమెరికా గడ్డమీదనే భారత పౌరుడిగా జీవించి అనేకమైనటువంటి మందులకి అసంఖ్యాకమైనటువంటి మందులకి ఆయన ప్రయోగాలు చేసి , ఆవిష్కరించి అమెరికా గడ్డమీదనే కన్నుమూశాడు. ఆయన పేరే డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు గారు. సంకల్పం..! ఆ ఆనందీబాయి జోషీమో డాక్టర్ అవ్వాలనుకోవడం,ఎల్లాప్రగడ సుబ్బారావు గారేమో మందులు కనిపెట్టాలనుకోవడం.. ఇదిగో అదే కోవలో దుర్గాబాయమ్మ గారు క్రిమినల్ లాయర్ కావాలనుకున్నారు. కలను సాకారం చేసుకున్నారు తర్వాత. అందుకే ఆవిడ సంకల్పం వజ్ర సంకల్పం అంటారు.

ఆ జైలు లో జరిగే అన్యాయాలనెదిరించటం, సరిగా రేషన్ ఇవ్వకపోతే వాటన్నింటికి ఎదురు తిరగడం ఇలాంటివన్నీ కూడా చేశారు. వాటన్నింటికంటే కూడా జైలు లో ఉండగా ఆవిడ చేసినటువంటి మరొక ముఖ్యమైనటువంటి ప్రతిపాదనేమిటంటే, ఈ రాజకీయ ఖైదీలందరికి ఏ.క్లాసని, బి క్లాసని , సి క్లాసని విడదీస్తారు. అందరు చేసిన తప్పు ఒకటే.తప్పు అంటే బ్రిటిష్ వాళ్ళ దృష్టిలో – అందరూ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నప్పటికీ కాస్త పేరున్నటువంటి రాజకీయ నాయకులకి ఏ.క్లాస్ అని, తర్వాతి వాళ్లకి బి.క్లాస్ అని , మామూలు వాళ్లకి సి.క్లాస్ అని ఇచ్చేవాళ్ళు. ఆవిడ జైలు అధికారులతోటి పోట్లాడింది – ఇలా మూడు క్లాస్ లు ఉండడానికి వీల్లేదు. అందరూ ఒకే రాజకీయ పోరాటంలో పాల్గొన్నాము ఒకే క్లాస్ ఉండాలి మాకు ప్రత్యేకమైనటువంటి సౌకర్యాలు ఉండాల్సిన అవసరం లేదు– అని.

ఆవిడ ఆవిధంగా జైలు లో ఉండి రాజకీయ మహిళా ఖైదీల పరిస్థితిని గమనిస్తూ జైలు వాళ్ళతో అంతర్గతంగా పోరాటం కొనసాగిస్తూ ఒక తొమ్మిది, పది నెలలు ఆవిడ జైలులో ఉన్నారు. జైల్లో నుంచి విడుదల చేసాక గుంటూరు లో అల్ ఇండియా కాంగ్రెస్ మీటింగ్ జరుగుతుంటే, ఆ మీటింగు కెళ్ళి ఒక ప్రతిపాదన పెట్టారు. "మన అందరమూ కూడా జైలులో ఒకే క్లాస్ లో ఉండాలి. ఇలా కొంతమంది సి క్లాస్ అని చెప్పి వాళ్లకు సౌకర్యాలు లేకుండానూ, మనమేదో కొంచెం పేరున్నవాళ్లమని చెప్పి మనకు సౌకర్యాలున్నట్టు గాను ఇలా ఉండకూడదు" అని. ఆ ప్రతిపాదన ఆమోదింపచేశారు. ఇక

తర్వాత ఎంతమంది పాటించారో అనేది వేరే విషయమనుకోండి. తర్వాత రెండోసారి ఆవిడని అరెస్ట్ చేసినప్పుడు కూడా ఆవిడ నాకు ఏ క్లాస్ వద్దు మిగతా వాళ్లందరికీ ఏ.క్లాస్ ఇస్తే ఆ క్లాసే అంటే సి క్లాస్ ఇవ్వండి అని పోరాడారు. అంతగా ఆవిడ నిబద్ధతగా ఉండేవాళ్ళు , నిజాయితీగా ఉండేవాళ్ళు.

1932 ప్రాంతాల్లో జైలు నుంచి విడుదలయ్యాక కాకినాడకు వచ్చేశారు. అప్పటిదాకా వాళ్ళమ్మగారు బాలికా హిందీ పాఠశాల చూసుకుంటున్నారు. జీవితాలు ఎలా ఉంటాయంటే, ఆ తల్లి నేర్చుకున్న హిందీ కేవలము అప్పుడే కాదు భవిష్యత్తులో కూడా ఉపయోగపడిందావిడకు. ఎలాగంటే,ఈ స్కూలు కొంచెం తక్కువగా నడిచింది దుర్గాబాయమ్మగారు లేని రోజుల్లో. ఆమె విడుదలై వచ్చాక కూడా బ్రిటీష్ వాళ్ళు దుర్గాబాయమ్మ గారి కదలికల మీద నిఘా విధించారు వాళ్ళు. దుర్గాబాయమ్మ గారు నడుపుతున్న స్కూలు మీద కూడా నిబంధనలు విధించడం ప్రారంభించారు. దాంతోటి ఆ స్కూలుకొచ్చేటటువంటి ఆ విద్యార్థుల సంఖ్య కూడా తగ్గింది. దీనికి తోడుగా వాళ్ళమ్మగారు కూడా ఈ రాజకీయాల్లో పాల్గొని ఆవిడ కూడా జైలు కెళ్ళారు. దాదాపుగా పది సంవత్సరాలు గా తల్లీకూతుళ్ల యొక్క అవిశ్రాంత కృషి ఫలితంగా కొనసాగినటువంటి ఆ పాఠశాల 32, 33 ప్రాంతాల్లో మూతబడిపోయింది. దుర్గాబాయమ్మగారు కూడా మరోసారి జైలుకెళ్ళే సమ్దర్భం వచ్చింది. ఈ సారి మధురై జైలు లో దాదాపుగా ఓ సంవత్సరము ఉన్నారు. అక్కడ దుర్గాబాయమ్మ గారికి చాలా భయంకరమైన అనుభవాలెదురైనవి. ఆవిడని సాలిటరీ కన్ఫైన్మెంట్ అని, ఒక్కదాన్నే ఒక గదిలో పెట్టారు. దుర్గాబాయమ్మ గారి రూము పక్కనే ఉరి శిక్షకి ఎదురు చూస్తున్నటువంటి మహిళలుండేవాళ్లు. వాళ్ళు రాత్రిపూట వేసే కేకలు వాళ్ళ పిల్లల్తో వాళ్ళు పడే బాధలు ఇవన్నీ చూసి దుర్గాబాయమ్మ గారు మానసికంగా కూడా కొంత దెబ్బతిన్నారు. దెబ్బతినడమే కాకుండా ఆవిడకి హిస్టీరియా , మూర్ఛా ఇలాంటిది వచ్చేది ఉన్నట్టుండి. ఇదంతా కూడా ఒక సంవత్సరము లో ఆవిడకి జరిగినటువంటి పరిణామాలు. ఆవిడకి కొంత అనుమానం కూడా వచ్చింది – తనకిచ్చే ఆహారంలో కూడా ఏమైనా విషం కలుపుతున్నారేమో అని. అంతేకాకుండా ఆవిడ చేతులదగ్గర్నుంచి రక్తం కారడం , ఆ రక్తం కూడా నల్లగా ఉండడం జరిగాయి. 1932, 33 ప్రాంతాల్లో మధురై జైలు నుంచి విడుదలయ్యాక ఆవిడ మద్రాసులోనే హాస్పిటల్ లో చాలా రోజులుండి వైద్యం చేయించుకున్నారు. ఆవిడకు వైద్యం చేసినటువంటి రంగాచారి అనే డాక్టర్ గారు “అమ్మా! నీవింక రాజకీయాల్లోకి వెళ్లొద్దు, మీ ఆరోగ్యం మీకు అనుమతించదు “ అని అయన సలహా ఇచ్చారు.

ఆవిడ జైలు లో నుంచి బయటికి వచ్చేసి కాకినాడ వచ్చేసరికి పరిస్థితి ఏమిటి? స్కూలు మూతబడిపోయింది. వాళ్ళమ్మగారు కూడా అప్పుడే జైలు నుంచి వెనక్కొచ్చారు. ఇప్పుడేం చెయ్యాలి తర్వాత కార్యక్రమమేమిటి? అనుకున్నప్పుడు దుర్గాబాయమ్మ గారికి గుర్తొచ్చింది. గుర్తు రావడం కాదు ఆవిడకు గుర్తుంది ఎప్పట్నుంచో ఏమిటి? ఆవిడ క్రిమినల్ లాయర్ చదవాలి. ఎలా చదువుతారు క్రిమినల్ లాయర్ ? అప్పటివరకు హైస్కూలు కూడా పాసవ్వలేదు. క్రిమినల్ లాయర్ కావాలంటే హైస్కూలు పాసవ్వాలి.ఇంటర్మీడియట్ అవ్వాలి, డిగ్రీ అవ్వాలి, లా అవ్వాలి ఇవన్నీ చదవాలి.

24 సంవత్సరాల వయసులో దుర్గాబాయమ్మ గారు మళ్ళీ ఒక సంకల్పము! క్రిమినల్ లాయర్ అవ్వాలి ఈ చదువులన్నీ చదవాలి. ఎవరు చెబుతారు దుర్గాబాయమ్మ గారికి!? అప్పటికే ఆవిడ ఒక పెద్ద స్టార్ రాజకీయాల్లో. ఆ రోజుల్లోనే దుర్గాబాయమ్మ గారి పేరుమీద దుర్గాబాయమ్మ గారి అంచు చీర అని కొన్ని చీరలు అమ్మేవారట .అంతగా పేరుంది ఆవిడకి. ఆవిడమీద ఇంకా బ్రిటిష్ వాళ్ళ నిఘా కొనసాగుతుంది. లాంటి రోజుల్లో ఆవిడకి సహాయం చేయడానికి ఒక వ్యక్తి ముందుకొచ్చారు. ఆయన కూడా విప్లవాత్మక మైన ఉద్యమాలు చేసిన వ్యక్తి. ఆయన పేరు గోపరాజు రామచంద్రరావు గారు.గో.రా అనే పేరుతో ఆ తర్వాత విజయవాడ లో నాస్తిక కేంద్రాన్ని ప్రారంభించి కొనసాగించారు. ఆ గోపరాజు రామచంద్రరావు గారు కాకినాడలో బోటనీ లెక్చరర్ గా పనిచేస్తూ ఉండేవాళ్ళు. ఆయన అప్పటికే ఈ హరిజన వాడలకి వెళ్ళి, సేవ చేయడం ఇలాంటి వాటి తోటి ఆయన కూడా కొన్ని రోజులు సంఘ బహిష్కారానికి గురయ్యారు. “నేను చెప్తానమ్మా నీకు ముందు ఏం కావాలి ? ఇంగ్లీష్ కావాలి.” ఇంగ్లీష్ తో ప్రారంభించి మిగతా సబ్జెక్టులన్నీ కూడా చెప్పడానికని ఆయన దుర్గాబాయమ్మ గారి ఇంటికెళ్ళి , ఆయన కాలేజీ అయిపోయాక పాఠాలు చెప్పే వాళ్ళు. ఈయన దుర్గాబాయమ్మ గారింటికెళ్ళి పాఠాలు చెబుతుంటే, ఆయన మీద కూడా బ్రిటీష్ వాళ్ళ నిఘా పెట్టారు. నిఘా ఉండడమే కాకుండా కాలేజీ యాజమాన్యం మీద వత్తిడి తీసుకొచ్చారు. “ఈయన కాలేజీలో పనిచేయడానికి వీలు లేదు ఈయన ఉద్యోగం తీసేయండి” అని. అప్పటికే ఆయన మీద సంఘ బహిష్కారం ఉంది – బయటికి వెళ్ళి అందరికి సేవ చేస్తున్నారు అస్పృశ్యతా నివారణ వీటన్నిటిలో ఉన్నారని. ఎలాగైతే ఆయనను కాలేజీ నుంచి ఉద్యోగం తీసేసారు. దాంతోటి గో.రా.గారు ప్రత్యేకంగా ఒక ట్యుటోరియల్ కాలేజీ పెట్టారు. అప్పుడు దుర్గాబాయమ్మ గారు ఆ ట్యుటోరియల్ కాలేజీకి వెళ్ళి అక్కడ చదువుకోవడం ప్రారంభించారు. ఇదంతా జరిగి పది నెలలో, పదకొండు నెలలో. చదువుకొనడం 1933 లో ప్రారంభించి 1934 మే వచ్చేసరికి ఆవిడ మెట్రిక్యులేషన్ రాయడానికి

సంసిద్ధంగా ఉన్నారు. బెనారస్ లో ,మెట్రిక్యూలేషన్ అయితే లెక్కలు సబ్జెక్ట్ ఉండదు. 1934 మే లో బెనారస్ వెళ్లి అక్కడ ఆవిడ ఈ మెట్రిక్యూలేషన్ యొక్క పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారు. ఆ బెనారస్ హిందూ యూనివర్సిటీ లో మదన్ మోహన్ మాలవ్యా గారిని కూడా సందర్శించి ఆయన యొక్క రికమండేషన్ తోటి అక్కడే స్కాలర్షిప్ తెచ్చుకొని అక్కడ ఇంటర్మీడియట్ చదువుకోడానికని కొనసాగారు.

కాకినాడలో ఏమౌతోందంటే – దుర్గాబాయమ్మ గారి తమ్ముడు గారు నారాయణ రావు గారు కాలేజీలో చదువుతూ ఉన్నాడు. ఆయన మీద కూడా ఈ రాజకీయ రంగు పులిమి ఆయనను కూడా కాలేజీ నుంచి తీసేశారు. దాంతోటి వాళ్ళమ్మగారు కృష్ణవేణమ్మ గారు, వాళ్ళ తమ్ముడు గారు రాజమండ్రి వెళ్లారు. అక్కడ చదువు కోవడం ప్రారంభించాడు ఆ కుర్రాడు. కృష్ణవేణమ్మ గారు రాజమండ్రి లో ఒక స్కూలు లో 50 రూపాయలకి ఓ టీచర్ గా పనిచేస్తూ అక్కడ కొడుకుని చదివిస్తూ, బెనారస్ లో చదివేటటువంటి కూతురు కి డబ్బులు పంపిస్తూ ఉండేవారు. అందుకే దుర్గాబాయమ్మ గారిని గుర్తు చేసుకున్నప్పుడు వాళ్ళమ్మగారిని కూడా తప్పనిసరిగా చెప్పుకోవాలి అంటూ ఉంటారు.

వాళ్ళ తమ్ముడు కూడా రాజమండ్రిలో అయిపోయి ఆయన కూడా పొలిటికల్ సైన్స్ చదవడానికి ఆయన కూడా బెనారస్ వెళ్లారు. ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గరికి రాగానే దుర్గాబాయమ్మగారికి మశూచి లాంటిదేదో వస్తే – మదన్మోహన్ మాలవ్య గారు ఆవిడకి ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించి ఆ గదిలో ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో వాళ్ళ తమ్ముడు కూడా అక్కడ పొలిటికల్ సైన్స్ పూర్తయ్యి రాజమండ్రి వచ్చారు. ఈవిడ ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని అక్కడ పొలిటికల్ సైన్స్ చదవాలనుకున్నారు. అప్పటికి మదన్మోహన్ మాలవ్య గారు నిర్మిస్తున్న బెనారస్ హిందూ యూనివర్సిటీ బిల్డింగ్ లు చూసి ఎప్పటికైనా నేను కూడా ఇలాంటి విద్యాలయాల్ని స్థాపించగలనా? మహిళలకి సహాయం చేయగలనా? అని

ఇంటర్మీడియట్ అయిపోయాక ఆవిడ పొలిటికల్ సైన్స్ లో చేరదామని మదన్ మోహన్ మాలవ్యా గారిని అడిగారు. ఆయనేమో " అమ్మా ఆడవాళ్ళకు పనికిరానిదిఈ పొలిటికల్ సైన్స్ అనేది కేవలం మగవారికి మాత్రమే అందుకే మీ తమ్ముడు చదువుకొని వెళ్ళాడు కదా! నీకు మాత్రం ఈ పొలిటికల్ సైన్స్ వద్దు" అన్నారు. అది సుమారుగా 1937 ప్రాంతములో.

అప్పుడు దుర్గాబాయి గారు ఆంధ్ర యూనివర్సిటీ కి వచ్చారు. వైస్ ఛాన్సలర్ గా కట్టమంచి రామలింగారెడ్డి గారు ఉన్నారు.(సి.ఆర్.రెడ్డి గారు). ఆయన "అమ్మా నిన్ను పొలిటికల్ సైన్స్ లో చేర్చుకోడానికి నాకేం అభ్యంతరం లేదు కానీ ఆడవాళ్ళుండడానికి హాస్టల్ లేదు. బయట ఉండడం నాకు అంతగా నచ్చదు. హాస్టల్ లేదు కాబట్టి నీకు సీటు ఇవ్వను" అన్నారు.

"ఎందుకు లేదు హాస్టల్?" .

" అంటే ఆడవాళ్ళెవరూ లేరు కాబట్టి నేను హాస్టల్ పెట్టలేదు" .

"మీరు పెడితే గదండి వచ్చేది"

".ఏమోనమ్మా నీతో నైతే వాదించలేను. హాస్టల్ అయితే లేదు కాబట్టి నేను నీకు సీటు ఇవ్వలేను" అన్నారాయన.

".అయితే హాస్టల్ ఉంటె మీరు సీటు ఇస్తారా?" అని అడిగిందావిడ.

"అలాగే ఇస్తాను" అన్నాడాయన.

దుర్గాబాయమ్మ గారి సంకల్పం ఎలాంటిదంటే, వెంటనే, రాజకీయనాయకుడు తెన్నేటి విశ్వనాథం గారితో మాట్లాడి, పేపర్ లో ఒక ప్రకటన ఇచ్చారు. ఓ పది మందో, పన్నెండు మందో వెంటనే ఆమెను సంప్రదించారు. ఈ పది పన్నెండు మందిని కలిపి ఒక ఇల్లు తీసికొని దాన్నే హాస్టల్ లాగా అనుకోని, ఆవిడ ఆ భోజనానికి అన్నిటికి ఏర్పాట్లు చేసికొని, అప్పుడు రామలింగారెడ్డి గారి దగ్గరికెళ్లి "నేను హాస్టల్ పెట్టాను ఇప్పుడు మా అందరికి కూడా మీరు సీట్లు ఇవ్వండి" అని అడిగిందావిడ. తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన సీట్లిచ్చారు. ఆ తర్వాత కొన్ని రోజులకి యూనివర్సిటీ యాజమాన్యం కూడా "ఎందుకమ్మా మీరందరూ ఆ ఇంట్లో ఉండడం , మేమె హాస్టల్ ప్రారంభిస్తాం" అని చెప్పారు. ఆ విధంగా ఆంధ్ర యూనివర్సిటీ లో లేడీస్ హాస్టల్ మొదలైంది. ఇలా చెప్పుకోవాలంటే,ఆంధ్ర యూనివర్సిటీ లో లేడీస్ హాస్టల్ ప్రారంభించటానికి కూడా దుర్గాబాయి దేశ్ ముఖ్ గారు చేసినటువంటి ప్రయత్నాలే పునాది అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

ఆ రోజుల్లోనూ ఆవిడ రాజకీయాలతో పూర్తిగా దూరంగా లేరు, కానీ ఎక్కువ సమయాన్ని చదువుకునేందుకు మాత్రమే కేంద్రీకరించారు.సరే ఈవిడ ఇక్కడ ఇలా ఉండగా,రాజమండ్రి లో వాళ్ళమ్మగారు, తమ్ముడు గారు — వాళ్ళ పరిస్థితి ఎలా ఉందంటే – వాళ్లకి బాగా తెలిసినటువంటి బులుసు

సాంబమూర్తి గారు అప్పుడు మద్రాస్ అసెంబ్లీ లో స్పీకర్ గా ఎన్నికయ్యారు. ఆయన దుర్గాబాయమ్మగారి తమ్ముడ్ని పర్సనల్ అసిస్టెంట్ గా రమ్మన్నారు . అలా దుర్గాబాయమ్మ గారి అమ్మగారైన కృష్ణవేణమ్మ గారు , తమ్ముడు నారాయణ రావు గారు కలిసి మద్రాస్ వెళ్లారు. అందువల్ల , దుర్గాబాయమ్మగారు, సెలవులకి మద్రాసు వెళ్లే వాళ్ళు. అక్కడ వాళ్ళుండేటటువంటి పరిసర ప్రాంతాల్లో కొత్త ఇళ్ళ నిర్మాణం జరుగుతోంది. అక్కడ ఆడా, మగా కూలీలు పనులు చేస్తుంటే వాళ్ళ పిల్లలు అక్కడ దుమ్ములో ధూళిలో ఆడుకుంటుండే వాళ్ళు. ఇది గమనించిన దుర్గాబాయమ్మగారి అమ్మగారు, ఆ పిల్లలకి ఆటపాటలు నేర్పడం,పాటలు నేర్పడం ఇలాంటివన్నీ చేశారు. వాళ్ళమ్మగారు అప్పట్లో మద్రాస్ లో సేవా సదన్ హై స్కూల్ హిందీ టీచర్ గా పనిచేస్తూ చూడండి. సరిగ్గా అదే రోజుల్లో మద్రాస్ లో అల్ ఇండియా రేడియో ప్రారంభమైంది. దాంట్లో చిన్న పిల్లల కార్యక్రమం ఒకటుండేది. వాళ్ళు – దుర్గాబాయమ్మగారి అమ్మగారు కృష్ణవేణమ్మగారు, పిల్లలకు ఆటలూ పాటలూ నేర్పడం గురించి తెల్సుకున్నారు. అప్పటికి రేడియో లో పిల్లల కార్యక్రమానికి ఇంచార్జి గా ఉన్నటువంటి బాలాంత్రపు రజినీకాంత రావు గారు, ప్రయాగ నరసింహ శాస్త్రి గారు , కృష్ణవేణమ్మగారి దగ్గర పాటలు నేర్చుకున్న పిల్లల్ని రేడియో కార్యక్రమాలకి తీసికెళ్ళడం మొదలెట్టారు. ఆ తర్వాత రేడియో వాళ్ళే, సిలబస్ లాంటిదిచ్చి పిల్లలకు ఎలా నేర్పించాలో చెప్పారు. అలా కృష్ణవేణమ్మగారు తాను పాఠాలు చెబుతున్న ఆ కార్యక్రమానికి "లిటిల్ లేడీస్ అఫ్ బృందావన్" అని పేరు పెట్టి ఒక చిన్న స్కూలు లాగా నడపడం కొనసాగించారు. దుర్గాబాయమ్మ గారు మధ్యమధ్యలో శెలవులకి వచ్చినప్పుడు, అమ్మ నడిపే చిన్న స్కూలుకి చందాలవి కావాలంటే తనకున్న పలుకుబడితో తెచ్చిపెడుతుండే. కొంతకాలమయ్యాక , పిల్లలకు డాన్స్ కూడా నేర్పితే బావుంటుందని తంజావూర్ రంగనాయకి అనే ఆవిడ్ని తీసుకొచ్చి , పిల్లకు డాన్స్ కూడా నేర్పించటం ప్రారంభించారు.

కొన్ని నెలలకు, వీళ్ళ ఇల్లు ఇరుకై పోయి, దాన్ని బులుసు సాంబమూర్తి గారు మా ఇంటి వెనకాల ఒక షెడ్డు లోకి మాచారు. ఆయన ఓసారి సలహా ఇచ్చారు " మీరిలాగా ఒక్కళ్ళే ఎంతకాలం చేస్తారు? మద్రాస్ లో ఉన్నటువంటి తెలుగువాళ్లందరూ కలిసి ఆంధ్ర మహాసభని పెట్టారు. మీ స్కూలుని దానికి అనుబంధంగా చేసేయండి. అలాగైతే కూడా మీకు కూడా చాలా బలం వస్తుంది , ఎక్కువ కార్యక్రమాలు కూడా చేయొచ్చు" అని. అలా లిటిల్ లేడీస్ అఫ్ బృందావన్ అనే చిన్న స్కూలు లాంటి దాన్ని తీసికెళ్ళి ఆంధ్ర మహాసభ లో కలిపారు. ఆంధ్రమహాసభ లో, ఈ పిల్లలు, స్త్రీల యొక్క విభాగం మొదలు పెట్టారు. కొంతకాలానికి అక్కడ కొనసాగించేకంటే కూడా సొంతంగా సంస్థేదైనా పెట్టుకుంటే బావుంటుందని దుర్గాబాయమ్మ గారికి అనిపించింది. సరిగ్గా అదే సమయంలో ఆవిడ ఆంధ్రా యూనివర్సిటీ లో పొలిటికల్ సైన్స్ పూర్తి చేసికొని మద్రాస్ వచ్చారు, 1939 ప్రాంతాల్లో. మద్రాస్ లో లా లో చేరారు. ఒకవైపు ఆవిడ లా కాలేజీలో చదువుకుంటూ రెండో వైపు లిటిల్ లేడీస్ అఫ్ బృందావన్ అనే దాన్ని విడిగా తీసికొచ్చేసి దానికి ఆంధ్ర మహిళాసభ అని పేరు పెట్టారు 1940 ప్రాంతాల్లో. ఆ విధంగా దాదాపుగా 77 సంవత్సరాల క్రిందట ఈ ఆంధ్రమహిళాసభ అనేటటువంటి ఆ మహా వృక్షానికి విత్తనం ఏర్పడింది. దాని భవిష్యత్తు ఎలా కొనసాగిందంటే – దుర్గాబాయమ్మ గారు ఒక్కొక ప్రయత్నం చేసుకుంటూ వెళ్లడం, ఏదో ఒక సవాలెదురవ్వడం , ఆ సవాల్ను పరిష్కరించుకొనే క్రమంలో మరొక సంస్థ స్థాపించడం , దాన్ని పైకి తీసుకురావడం.. ఇలా! ఈ మహిళా సభకు పిల్లలు చదువుకోడానికి వచ్చినపుడు, వాళ్ళ మాతృమూర్తులందరూ వచ్చి బయట కూర్చుంటున్నారు. సరే వాళ్ళను ఖాళీగా ఎందుకు కూర్చోబెట్టాలి?వాళ్లకు హిందీ నేర్పుదామని వాళ్లకు కూడా ఒక స్కూలు లాంటిది ప్రారంభించారు కృష్ణవేణమ్మ గారు. మరొకొంచెం చందాలు సేకరించి చేసి లజ్ చర్చి రోడ్ లో ఓ పెద్ద బిల్డింగ్ తీసికొని, అక్కడకు మార్చారు. అప్పటికి దాదాపు వందమంది పిల్లలున్నారు, ఒక యాభైమంది వాళ్ళతో వచ్చినటువంటి తల్లులున్నారు.

ఈ విషయం తెలిసి చుట్టుపక్కల ఊర్ల నుంచి కూడా కూడా తల్లులు రావడం ప్రారంభించారు. వాళ్ళ కోసం హాస్టల్ ప్రారంభించారు. స్వయంపోషకత్వం కోసమని ఒక వర్క్ షాప్ పెట్టారు. లా చదువుతూనే ఈ పనులన్నీ చేశారు దుర్గాబాయమ్మ గారు, వాళ్ళమ్మ గారు కృష్ణవేణమ్మ గారు. 1942 ఆ ప్రాంతాల్లో దుర్గాబాయమ్మ గారికి లా అయిపోయి ఆవిడ క్రిమినల్ లాయర్ గా రిజిస్టర్ చేయించుకున్నారు. మరెన్నో ఆటుపోట్లు ఎదుర్కుంటూ ఈ ఆంధ్ర మహిళాసభని ముందుకు తీసికెళ్లినటువంటి విధానం, ఆ తర్వాత ఆవిడ ఈ రాజ్యాంగ నిర్మాణ సమితిలో ఆవిడ సభ్యురాలైనటువంటి విధానం ఈ మిగతా విశేషాలన్నీ కూడా మనం వచ్చే భాగంలో తెలుసుకుందాం.

**(ఆడియో టాక్ షో కి అక్షరరూపం ఇచ్చినవారు – శ్రీ బొడ్డు సత్యనారాయణ)**

(సశేషం)

2017 మార్చి 7 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS